# సాక్షి శ్రీకాకుళం

శనివారం ၊ 19 ၊ ఆగస్టు ၊ 2023






### తరగతి బయట పాఠాలు

డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ మొదలుకానుంది. సామర్థ్యం మేరకు శాఖ కేటాయించారు. - IIలో



### వీడిన మర్డర్ మిస్టరీ

శ్రీకాకుళంలోని మర్డర్ మిస్టరీ వీడింది. తోటి పనిమనిషే యువతిని హత్య చేసినట్లు నిర్ధారణ అయ్యింది. - IIలో

### మాస్టర్ ట్రైనీగా కరజాడ ఉపాధ్యాయుడు

మెళియాపుట్టి: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, విద్యాశాఖ ఆధ్వర్యంలో టీచర్లకు శిక్షణ ఇవ్వడానికి మండలంలోని కరజాడ ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎల్.వెంకటాచలం ఎంపికయ్యారు. విద్యార్థి వినియోగదారుల క్లబ్‌లను జిల్లాలో 100 వరకూ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అందులో భాగంగానే పాఠశాల స్థాయిలో క్లబ్ నిర్వహించడానికి గైడ్‌గా ఉన్న ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడానికి ఆయనను మాస్టర్ ట్రైనీగా ఎంపిక చేశారు.

## న్యూస్‌రీల్

### ఓటర్ల సర్వేపై కలెక్టర్‌కు అభినందన

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024లో భాగంగా చేపట్టిన ఇంటింటా సర్వేలో శ్రీకాకుళం జిల్లా దాదాపు 90 శాతం పూర్తిచేయడంపై కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా అభినందించారు. మిగిలిన పది శాతం కూడా రానున్నమూడు రోజుల్లో పూర్తిచేసి వంద శాతం పూర్తిచేయాలని ఆకాంక్షించారు. ఇంటింటా ఓటర్ల సర్వేపై జిల్లా కలెక్టర్లతో శుక్రవారం ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. 2022 జనవరి 6 నుంచి 2023 ఆగస్టు 10 వరకు జరిగిన తొలగింపు ఓటర్ల జాబితాలను పునఃపరిశీలించి ఆ తదుపరి మాత్రమే చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో 5,87,150 గృహాలకు గాను 5,26,294 గృహాలను సందర్శించి దాదాపు 90 శాతం సర్వే పూర్తి చేశామన్నారు. అలాగే ఇంటింటా సర్వేలో 18,06,841 మంది ఓటర్లకు గాను 10,164 మంది ఓటర్లు మరణించినట్లు నిర్ధారించినట్లు చెప్పారు. ప్రతి ఇంటిని సర్వే చేయించి సందేహం ఉన్నచోట అధికారులతో పున:పరిశీలన చేయిస్తున్నట్లు చెప్పారు. మూడు రోజుల్లో మిగిలిన 10శాతం సర్వేను పూర్తిచేసి, శతశాతం సర్వే పూర్తిచేయనున్నట్లు వివరించారు.ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి పి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగుల స్పందనకు 26 వినతులు



ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్యోగులు తమ స్పందనకు వచ్చే ముందు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఉద్యోగుల స్పందన నిర్వహించారు. జీత, భత్యాలు అందలేదని, సీనియారిటీ, పదోన్నతులు, ఇంక్రిమెంట్లు, తదితరమైన సమస్యలపై మొత్తం 26 అర్జీలు స్వీకరించారు. అర్జీల స్వీకరణలో ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రాజేశ్వరరావు, సెక్షన్ అధికారి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

### సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైం: సిబ్బంది సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు. పోలీసు సిబ్బంది, మినిస్టీరియల్ స్టాఫ్ సమస్యలపై శుక్రవారం గ్రీవెన్సు డే నిర్వహించారు. సిబ్బంది వ్యక్తిగత సమస్యలపై ఎస్పీ వినతులు స్వీకరించి పరిశీలించారు. సిబ్బంది సంక్షేమమే తమకు ప్రధానమని ఆమె తెలిపారు. సమస్యలు ఉన్న సిబ్బంది ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ఈతమానుగూడ, లబ్బ గ్రామాల్లో భయం భయం



కొత్తూరు మండలం ఈతమానుగూడ వద్ద పులిపాదముద్రలు

కొత్తూరు: మండలంలోని ఈతమానుగూడ, లబ్బ, కారిగూడ, బాంద్రగూడ, శ్రీరాములు గూడలతో పాటు పలు గిరిజన గ్రామాలకు పులి భయం పట్టుకుంది. ఈ గ్రామాలను ఆనుకుని ఉన్న కొండల్లో పులి పాదముద్రలను అధికారులు గుర్తించారు. దీంతో లబ్బ, గొట్టిపల్లి, ఓంద్రుజోల, గూనభద్ర, నేరడి గ్రామ సచివాలయాల పరిధిలోని అన్ని గ్రామాల్లో దండోరా వేసి ప్రజలను అప్రమత్తం చేయాలని పాతపట్నం సెక్షన్ ఫారెస్ట్ ఆఫీసర్ పి.యశస్వి శుక్రవారం ఆదేశాలిచ్చారు. దీంతో ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు దండోరా వేయించారు. పులి సంచారంపై స్థానిక పోలీసులకు ఫారెస్టు అధికారులు ఫిర్యాదు చేశారు. ఊరివాసులు పులి గ్రామాల్లోకి రాకుండా నిప్పులు పట్టుకుని అప్రమత్తంగా ఉన్నారు. పులి పాదముద్రలు కనిపించాయి తప్పితే పులి ఇంతవరకు ఎవరికీ కనిపించలేదు. కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని అటవీ శాఖ అధికారి తెలిపారు.

## శ్రావణం.. పూజలు ఘనం



శ్రీకాకుళం కల్చరల్: బాకర్‌సాహెబ్‌పేటలోని దుర్గామహాలక్ష్మి అమ్మవారికి పూజలు



శ్రీకాకుళం కల్చరల్: పాలకొండ రోడ్డులోని అమ్మవారికి బంగారు పూలతో అర్చన



నరసన్నపేట: వీరన్నాయుడు కాలనీ వద్ద సంతోషిమాత గుడిలో వ్రతాలు

శ్రావణ శుక్రవారం పూట జిల్లాలోని అమ్మవారి ఆలయాలు కళకళలాడాయి. ఊరూరా మహిళలు వ్రతాలు ఆచరించారు. ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.



ఎచ్చెర్ల: అమ్మవారికి అభిషేకిస్తున్న బాలభాస్కర శర్మ



మందస: వాసుదేవుని సన్నిధిలో శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారికి పంచాభిషేకాలు

# మాంచి క్లిక్ ఇచ్చే వృత్తి

బీరువాలోని అరకలో నానమ్మ ఫొటో.. ఓ తీపి గుర్తు. పర్సులోని అమ్మ ఫొటో.. సర్వకాల సర్వావస్థల్లో చిరునవ్వు పంచే చిత్తరువు. పాత పుస్తకాల పేజీల్లో దాచుకున్న ఓ రహస్య చిత్రం.. యవ్వనం వదిలిపెట్టిన ఓ గాయం. నాన్న దాచుకున్న కూతురి ఫొటో.. అంతకాలం ఆ మనిషి చెప్పలేకపోయిన ప్రేమకు నిదర్శనం. ఫొటో కేవలం కాగితం కాదు. అది మన గతం. కెమెరా ముందు నిలబడి నవ్విన రోజుల నుంచి తుమ్మినా దగ్గినా ఫొటో తీసి పదిలపరుచుకునే రోజుల వరకు ఫొటోగ్రఫీ ఎంతో మారింది. నేడు వరల్డ్ ఫొటోగ్రఫీ డే. ఒకప్పటిలా ఫొటో స్టూడియోలు లేకపోయినా ఆ వృత్తిలో ఉన్న వారికి మాత్రం ఇది మాంచి క్లిక్కిచ్చే పనే.



### నేడు ఫొటోగ్రఫీ దినోత్సవం

- పెరిగిన టెక్నాలజీతో అందరూ ఫొటోగ్రాఫర్లే
- మోడలింగ్‌లో ఫొటోగ్రఫీకి ప్రాధాన్యత

శ్రీకాకుళం కల్చరల్: అదో బుల్లి పెట్టె. అనుభూతులు ఎన్ని ఉన్నా.. మనిషి నవ్వును మాత్రమే అనుమతించే అరుదైన పెట్టె. క్లిక్ అనే శబ్దాన్ని, స్మైల్ ప్లీజ్ అనే పదాన్ని ఓ తీపి గురుతుగా గుండెల్లో బంధించేసిన సాధనం. దాని పేరే కెమెరా. ఇప్పుడంటే చేతిలోని మొబైల్‌తో ఫొటో అందరికీ అందుబాటులోకి వచ్చేసింది గానీ. ఒకప్పుడు మెడలో కెమెరా తగిలిస్తే చాలు సెలబ్రిటీ స్టేటస్ వచ్చినట్టే. కెమెరా స్విచ్‌పై చేయి ఉన్నప్పుడు అతడే రాజు. నవ్వమంటే నవ్వాలి, తల వంచమంటే వంచాలి, దించమంటే దించాలి. అక్కడ మొదలైన ఫొటోగ్రఫీ ఇప్పుడు ఇంటింటికీ చేరువైంది. నేటి ఆధునిక యుగంలో మోడలింగ్ రంగం యువతకు ఉపాధి అవకాశాలు తెచ్చిపెడుతుండడంతో ఫొటోగ్రాఫర్లకు అవకాశాలు పెరిగాయి. డిజిటల్ పనితనం ద్వారా లైటింగ్ హెచ్చుతగ్గులు తెలుసుకునే అవకాశం దక్కడంతో స్టిల్ ఫొటోగ్రఫీకి డిమాండ్ తగ్గింది. డిజిటల్ కెమెరాలు రూ.5వేలు నుంచి రూ.5లక్షల వరకు లభిస్తుండం, ఒకేచిప్‌లో ఎన్నో ఫొటోలు భద్రపరచుకునే సౌకర్యం ఉండడంతో ఇప్పటి తరం మొగ్గుచూపుతున్నారు. అలాగే ప్రత్యేకంగా లెన్స్‌లు అమ్ముతున్నారు. వీటి ఖరీదు రూ.లక్ష నుంచి పలుకుతోంది. ఈ లెన్సుల ద్వారా ఎలాంటి ఫొటోలైనా, ఎలాగైనా తీయవచ్చు



నాటికాలం 120ఎంఎం కెమెరా



రీల్‌కెమెరాలో ఆఖరి మోడల్

#### డిజిటల్ కెమెరాలకు గిరాకీ

డిజిటల్ యుగం మొదలు కావడంతో గత కొన్నేళ్లుగా ఫొటో స్టూడియోలు మూతబడుతున్నాయి. జిల్లాలో ఎంతో పేరు ప్రఖ్యాతలతో నడిచిన స్టూడియోలు నేడు ఉపాధి కోల్పోయి మూతపడ్డాయి. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ డిజిటల్ కెమెరాలకు గిరాకీ పెరగడంతో స్టూడియోలను వినియోగించడం మానేశారు. పెళ్లిళ్లు, ఇంటిలో పుట్టిన రోజులు, పండగల సమయాల్లో స్టూడియోలు జనాలతో కిక్కిరిసి ఉండేవి. ఇప్పుడా పరిస్థితి లేదు.

#### రాయితీలు ఇవ్వాలి



ఫొటోగ్రఫీ మీద రాష్ట్రంలో 80వేల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. జిల్లాలో 7వేల మంది ఉన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న టెక్నాలజీని అందుకోవడం కష్టంగా ఉంది. ఎక్విప్‌మెంట్ కొనుగోలు చేసేందుకు రాయితీ ఇస్తే బాగుంటుంది.

– మెట్ట నాగరాజు, రాష్ట్ర ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు

#### జిల్లాలో ఏడు వేల కుటుంబాలు..

ఫొటోగ్రఫీని వృత్తిగా చేసుకుని జిల్లాలో ఏడు వేల కుటుంబాలు బతుకుతున్నాయి. అయితే నిత్యం ఈ వృత్తిలో బిజీ ఉండదు. పెళ్లిళ్ల సీజన్ అయితే గిరాకీ ఉంటుంది. ఖర్చు కూడా బాగా పెరిగిపోయింది. మంచి కెమెరా కొనాలంటే రూ.5 లక్షల వరకు ఖర్చవుతోంది. ఇతర ఎక్విప్‌మెంట్‌కు ఇంకా పెట్టాలి. దీన్ని తట్టుకుని స్టూడియోపెట్టినా రోజురోజుకూ పెరుగుతున్న టెక్నాలజీని తట్టుకోవాలి. జిల్లాకేంద్రంలో మొదటి ఫొటో స్టూడియోగా నాగేశ్వర్ ఫొటో స్టూడియో ఉండేది. తర్వాత బెజవాడ ఫొటో స్టూడియో, విజయ ఫొటోస్టూడియో, మహావీర్ ఫొటో స్టూడియో, దేవ్ ఫొటోస్టూడియో, రాజరాజేశ్వరీ ఫొటోస్టూడియో, వర్మా ఫొటోస్టూడియో, పద్మాలయ ఉండేవి. పెద్ద వాళ్ల ఫొటోలను గొప్పగా తీసి వారి పనితనం తెలిపేందుకు బయట వేలాడదీసేవారు. ప్రస్తుతం చాలా మూతపడగా.. మరికొన్ని డిజిటలైజ్ అయ్యాయి.




మొట్టమొదటి ఫొటో స్టుడియో

## ఆన్‌లైన్ సేవలపై అవగాహన సదస్సు



ట్రైనింగ్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ భాస్కరరావు

టెక్కలి రూరల్: ఆస్పత్రుల్లో ఆన్‌లైన్‌లో ఓపీ నమోదు విధానంపై టెక్కలి జిల్లా ఆస్పత్రిలో శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ జె.భాస్కరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా ఓపీని రోగులు పొందవచ్చునని దానికి సంబంధించి ముందుగా అభ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని దాని ద్వారా ఓపీ పొందవచ్చని తెలిపారు. యాప్ లేని వారికి ఎలా డౌన్‌లోడ్ చేసుకుని ఐడీ పొందాలనే విషయంపై అవగాహన కల్పించారు. ఈ ట్రైనింగ్ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా సుమారు 50 మంది వైద్యులు, డేటా ఆపరేటర్లు హాజరయ్యారు. ఈ విధానం వల్ల రోగులకు ఓపీ లైన్‌లో నిలబడే అవస్థ తప్పుతుందని తెలిపారు. స్కాన్ అండ్ షేర్ పద్ధతి ద్వారా ఆస్పత్రి వద్ద ఉన్న బార్‌కోడ్ స్కాన్ చేసి నేరుగా ఓపీ పొంది వైద్యుల వద్దకు వెళ్లవచ్చని, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు పద్ధతి ద్వారా రోగి సమస్యను ఓపీ విభాగంలో చెబితే వారు వైద్యుడికి వివరాలు ఫార్వార్డ్ చేస్తారని, అక్కడ పరీక్షించాక రిపోర్టులు ల్యాబ్ నుంచి డాక్టర్‌కు వెళ్తాయన్నారు. తిరిగి రోగి మందులు తీసుకునే వరకు అన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.సూర్యారావు, ఆర్ఎంఓ మహారాజ్ పాల్గొన్నారు.

## నేడే స్థానిక పోలింగ్

- జిల్లాలో 4 సర్పంచ్‌లు, 11 వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్
- పోలింగ్ గ్రామాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు



గోకర్నపల్లిలో పోలీసు బందోబస్తు

అరసవల్లి: మరికొద్ది గంటల్లోనే స్థానిక ఉప ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. జిల్లాలో మొత్తం 4 సర్పంచ్ స్థానాలు, 11 వార్డు స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. జిల్లాలో 6 సర్పంచులు, 96 వార్డు సభ్యుల స్థానాలకు ఉప ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా, ఇందులో అత్యధిక స్థానాల్లో ఏకగ్రీవాలు కావడం విశేషం. ఇక మిగిలిన పంచాయతీల్లో బొప్పడాం (సరుబుజ్జిలి),అన్నాపురం (నందిగాం), భద్రి (సారవకోట), పెదలంకాం (బూర్జ) గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలకు, అలాగే 12 వార్డు సభ్యుల స్థానాల్లో శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగనుంది. ఈ మేరకు జిల్లా ఎన్నికల ప్రధానాధికారి, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, అదనపు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్‌లు ఎక్కడా ఇబ్బందులు లేకుండా బ్యాలెట్ పోలింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంటతో పోలింగ్ ముగియనుండగా, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు. అలాగే పరిస్థితులను బట్టి ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలను ప్రకటించి, విజేతల పేర్లు ప్రకటిస్తారు. ఎక్కడైనా అవసరమైతే ఈనెల 20న ఆదివారం రీపోలింగ్‌ను చేపట్టనున్నారు.



#### గోకర్నపల్లిలో నిలిచిన వార్డు మెంబరు ఎన్నిక

పొందూరు: మండలంలోని గోకర్నపల్లి పంచాయతీలో రెండో వార్డుకు జరగాల్సిన ఉప ఎన్నికను ఎన్నికల కమిషన్ వాయిదా వేసింది. ఈ నెల 19వ తేదీన ఎన్నిక జరగాల్సి ఉంది. ఈ ఎన్నికకు అవసరమైన ఓటరు లిస్టును పంచాయతీ కార్యదర్శి గోవిందరావు ట్యాంపరింగ్ చేశారని గోకర్నపల్లి మాజీ ఎంపీటీసీ సీపాన శ్రీరంగనాయకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ అధికారులు ఎన్నికను వాయిదా వేశారని ఎన్నికల జోనల్ అధికారి ఆంజనేయనాయక్ తెలిపారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తును గ్రామంలో ఏర్పాటు చేశారు.

## ప్రతి ధాన్యం గింజ ప్రభుత్వమే కొంటుంది



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నవీన్

- జేసీం ఎం.నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఖరీఫ్ పనులు ప్రారంభమైనందున విత్తనాలు, ఎరువులు, కొనుగోళ్లు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని జేసీ ఎం.నవీన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా ధాన్యం కొనుగోళ్ల కమిటీ సమావేశం (డీపీసీ) జేసీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు ఏ రకమైన వరి వంగడాలను వేసినప్పటికి, మంచి ధాన్యం ఉంటే వాటిని ప్రభుత్వం కచ్చితంగా కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. గత నాలుగేళ్లుగా జిల్లాలో ధాన్యం కొనుగోలు బాగా జరుగుతుందని కితాబునిచ్చారు. గతంలో జరిగిన లోపాలను సమీక్షించుకుని ఈ సారి మరింత మెరుగ్గా ధాన్యం కొనుగోలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గతంలో 71 రైతు భరోసా కేంద్రాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా వినియోగించామని, ఈసారి మరిన్ని ఆర్‌బీకేలను పీపీసీలుగా మార్చనున్నట్లు చెప్పారు. ఖరీఫ్ నందు లభ్యమయ్యే పంట అంచనాల్లో కచ్చితత్వం పాటించాలని సూచించారు. జిల్లాలోని ధాన్యం మిల్లులను అధికార బృందం పర్యవేక్షిస్తుందని, వాస్తవంగా మిల్లులకు ఉన్న కెపాసిటీ ఆధారంగా ధాన్యం కేటాయిస్తామని, తద్వారా సకాలంలో మిల్లింగ్ జరుగుతుందని వివరించారు. సమావేశంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ, జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్, ఎల్.డి.ఎం ఎం.సూర్య కిరణ్, జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఆర్.వి.ప్రసాదరావు, మత్స్య, పశుసంవర్ధక శాఖల సంయుక్త సంచాలకులు డా.పి.వి.శ్రీనివాసరావు, డా.ఎం.కిషోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఉత్తమ పంచాయతీగా పితాతొళి

మందస: మండలంలోని పితాతొళి పంచాయతీని ఉత్తమ పంచాయతీగా అధికారులు గుర్తించారు. ఈ మేరకు జాతీయ స్థాయిలో అవార్డు పొందడానికి ఎంపిక చేశారు. పంచాయతీలో జరుగుతున్న రూ.2.50 కోట్లతో అభివృద్ధి పనులు, ఆజాదీకా అమృత్ సరోవర్‌లో భాగంగా గొడియా చెరువును ధ్యానశివుని చెరువుగా సుందరంగా పితాతొళి మహిళా సర్పంచ్ చింతాడ సుధ తీర్చిదిద్దారు. ఇప్పటికే జిల్లాలోనే ఈ చెరువు ఉత్తమంగా ఎంపికైంది. ఇటీవల నాభూమి-నాదేశం కార్యక్రమంలో కూడా చక్కగా నిర్వహించి, అధికారుల ప్రశంసలు అందుకున్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల సచివాలయాల కన్వీనర్ చింతాడ గణపతి, సర్పంచ్ సుధ శుక్రవారం మాట్లాడుతూ రాష్ట్రమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో పంచాయతీ అభివృద్ధి చెందుతోందన్నారు. అభివృద్ధికి మంత్రి ఎంతో సహకరిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.



పితాతొళి గ్రామం

## 'పిల్లల నడవడిక గమనించండి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: పిల్లల్లో నేర ప్రవృత్తి రాకుండా పిల్లల నడవడికపై దృష్టి పెట్టాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. జిల్లా న్యాయ సేవా సదన్‌లో శుక్రవారం జువెనైల్ జస్టిస్ యాక్ట్ డీల్ చేసే వారికి వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి మాట్లాడుతూ పిల్లలు చట్టాలతో విభేదించకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ జీఆర్ రాధిక, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జువైనల్ జస్టిస్ యాక్ట్ జస్టిస్ బోర్డ్ ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ శారదాంబ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### నేషనల్ గ్రీన్‌కోర్ జిల్లా కోఆర్డినేటర్‌గా గోవిందరావు



డీఈఓ వెంకటేశ్వరరావును కలిసిన గ్రీన్‌కోర్ జిల్లా కోఆర్డినేటర్‌గా నియమితులైన గోవిందరావు

లావేరు: ఏపీ నేషనల్ గ్రీన్‌కోర్ జిల్లా కో ఆర్డినేటర్‌గా మండలంలోని బుడుమూరు హైస్కూల్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పూజారి గోవిందరావును నియమిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని శుక్రవారం ఉపాధ్యాయుడు గోవిందరావు విలేకరులకు తెలిపారు. ఈయనతో పాటు మరో పది మంది ఉపాధ్యాయులును క్లస్టర్ కోఆర్డినేటర్లుగా నియమించినట్లు తెలిపారు.

### విద్యుత్ షాక్‌తో యువకునికి గాయాలు



విద్యుత్‌షాక్‌తో గాయపడిన మర్ల అజయ్

మందస: మండలంలోని పొత్తంగి గ్రామానికి చెందిన మర్ల అజయ్ అనే యువకునికి శుక్రవారం విద్యుత్ షాక్ తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. కింద పడి ఉన్న విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు అజయ్‌కు తగలడంతో స్థానికులు రక్షించారు. 108 వాహనంలో హరిపురం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సకై పలాసలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. రెండు రోజుల క్రితమే విద్యుత్ వైర్లు తెగిపడ్డాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ దల్లి జానకిరావురెడ్డి చెప్పారు. విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు.

### పాము కాటుతో మహిళా పోలీసు మృతి



మహిళా సంరక్షణ కార్యదర్శి తామాడ జ్యోతికుమారి

కోటబొమ్మాళి: మండలంలోని తర్లిపేట సచివాలయంలో మహిళా సంరక్షణ కార్యదర్శి (మహిళా పోలీస్)గా పనిచేస్తున్న తామాడ జ్యోతికుమారి (36) పాముకాటుతో మృతి చెందారు. సంతబొమ్మాళి మండలం కాపుగోదాయవలస గ్రామానికి చెందిన తామాడ జ్యోతికుమారి తన తండ్రి రిటైర్డ్ వీఆర్‌ఓ తామాడ రామారావు ఇంటిలో ఉంటున్నారు. శుక్రవారం బాత్‌రూమ్ నుంచి బయటకు వస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను ఆటోపై కోటబొమ్మాళి సామాజిక ఆస్పత్రికి తరలిస్తుండగా జ్యోతికుమారి మార్గం మధ్యలోనే మృతి చెందారు. ఆమెకు భర్త జయరాజ్, కుమారుడు రఘునాథ్ ఉన్నారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆమె మృతిపై తర్లిపేట సచివాలయ సిబ్బంది వి.రమేష్, డి.అప్పన్న, ఎం.మాధురి, టి.రాము, వై.సింహాద్రి, హెచ్.మహందాత, బి.భాను తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

### కొత్తమ్మతల్లి బంగారం డిపాజిట్



బ్యాంకులో బంగారం డిపాజిట్ చేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి ఆలయానికి కానుకల ద్వారా వచ్చిన 750 గ్రాముల బంగారాన్ని విశాఖపట్నం స్టేట్‌బ్యాంకు శాఖలో గోల్డుబాండు స్కీము కింద శుక్రవారం డిపాజిట్ చేసినట్లు ఆలయ ఈఓ వాచకచర్ల రాధాకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఆభరణాల తనిఖీ అధికారి ఎం.వి.సురేష్‌బాబు, బ్రాంచి మేనేజర్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

## బులియన్

| విశాఖపట్నం | |
|---|---|
| బంగారం(24సి. 10గ్రా.) | 60,380–00 |
| బంగారం(22సి. 10గ్రా.) | 55,350–00 |
| వెండి (కిలో) | 80,000–00 |

## కోడిగుడ్ల ధరలు

| హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు) | |
|---|---|
| విశాఖపట్నం | రూ. 475.00 |
| విజయనగరం | రూ. 479.00 |
| శ్రీకాకుళం | రూ. 479.00 |

## చికెన్

| బ్రాయిలర్ | | |
|---|---|---|
| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
| ₹120 | ₹210 | ₹ 220 |

# తరగతి బయట పాఠాలు



ఇంటర్న్‌షిప్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ (ఫైల్)

- బీఆర్‌ఏయూ పరిధిలో ఇంటర్న్‌షిప్ ప్రారంభం
- విద్యార్థులకు ఉపయోగపడనున్న ప్రక్రియ

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యా మండలి విద్యలో సమూల మార్పులకు శ్రీకారం చుడుతున్నాయి. డిగ్రీలో ఆరు సెమిస్టర్లు పరీక్షలు రాయటం, విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేయడమే కాకుండా ఇంటర్న్‌షిప్ కూడా అమలు చేస్తున్నారు. గత ఏడాది నుంచే ఈ ప్రక్రియ మొదలైంది. ఐదో సెమిస్టర్‌లో పూర్తిగా ఇంటర్న్‌షిప్ అమలు చేశారు. ఇప్పుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో డిగ్రీ రెండో ఏడాది చదువుతున్న నాలుగో సెమిస్టర్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అమలు చేస్తున్నారు. శుక్రవారం ప్రారంభమైన ఈ ఇంటర్న్‌షిప్ సెప్టెంబర్ 30వ తేదీ వరకు కొనసాగుతుంది. నాలుగో సెమిస్టర్‌లో 6352 మంది విద్యార్థులు ఉండగా, 33 ప్రభుత్వ శాఖల్లో ఇంటర్న్‌షిప్ కల్పించారు. ప్రభుత్వ శాఖల్లో కేటాయింపులు కలెక్టర్ ఆదేశాల మేరకు చేశారు. మూడేళ్ల డిగ్రీలో 300 రోజులు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు నిర్వహిస్తారు. రెండు, నాలుగు, ఆరు సెమిస్టర్‌లో ఈ ఇంటర్న్‌షిప్ కొనసాగిస్తారు. విద్యార్థుల పరిశీలన, ప్రజెంటేషన్ నివేదిక, విశ్లేషణలు ప్రతిభ ఆధారంగా 300 మార్కులు, 16 క్రెడిట్లకు మార్కులు కేటాయిస్తారు. విద్యార్థులకు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలతో వారు ఆ విభాగంలో నిర్దేశించిన రోజులు పనిచేస్తారు.

**ఆసక్తి, సామర్థ్యాన్ని బట్టి..**

విద్యార్థులు ఆసక్తి, ప్రభుత్వ శాఖలు సామర్థ్యం బట్టి ఇంటర్న్‌షిప్ శాఖలు కేటాయించారు. వ్యవసాయ శాఖలో 285 మంది, విద్యా విభాగంలో 2206, అటవీ శాఖలో 152, వైద్య ఆరోగ్య శాఖలో 556, గ్రామ వార్డు సచివాలయాల్లో 2433, పోలీస్ శాఖలో 172, అగ్ని మాపక శాఖలో 71, మత్స్యశాఖలో 85, పశుసంవర్ధక శాఖలో 7, ఏపీఎస్‌ఆర్టీసీలో 20, కెమికల్‌లో 11, పౌరసరఫరాల శాఖలో ఒకరు, కలెక్టరేట్‌లో 57, వాణిజ్య పన్నుల శాఖలో 8, దేవదాయ శాఖలో ఒకరు, చేనేత, జౌళిశాఖలో 15, ఉద్యానవన శాఖలో 34, నీటిపారుదల శాఖలో 7, ఐటీడీఏ ఒకరు, గనుల శాఖలో ఒకరు, మున్సిపాలిటీలో 14, పంచాయతీ రాజ్‌లో 4, ఫార్మాలో 42, ఆర్‌అండ్‌బీలో 10, రిజిస్ట్రేషన్ శాఖలో 9, రెవెన్యూ శాఖలో 57, సోషల్ వెల్ఫేర్‌లో 20, ఆదాయ పన్నుల శాఖలో 21, ట్రాఫిక్‌లో 6, ట్రెజరీలో 7, వెలుగులో ఒకరు, మహిళా సంక్షేమ శాఖలో 18, జిల్లా పరిషత్‌లో 20 మందికి కేటాయింపులు చేశారు. ఈ శాఖల్లో సెప్టెంబర్ 30 వరకు పనిచేయాల్సి ఉంటుంది.

**పక్కాగా అమలు**



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలలో పక్కాగా ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నాం. కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని శాఖల్లో విద్యార్థులకు కేటాయింపులు జరిగాయి. విద్యార్థులకు అలాట్‌మెంట్ ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నాం. గత విద్యా సంవత్సరం ఐదో సెమిస్టర్‌లో విజయవంతంగా ఇంటర్న్‌షిప్ పూర్తి చేశారు.

– ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, రిజిస్ట్రార్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం.

**రాష్ట్రంలో ఆదర్శంగా అమలు**



గత విద్యా సంవత్సరంలో ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు ఐదో సెమిస్టర్‌లో ఇంటర్న్‌షిప్ అమలు చేశాం. జిల్లా అధికారుల సహకారంతో రాష్ట్రంలో ఆదర్శంగా అమలు జరిగింది. గత కంటే మెరుగ్గా అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

– ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు, వైస్ చాన్సలర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం.

## డిప్యూటీ కలెక్టర్ పోస్టుకు సువర్ణ ఎంపిక



తండ్రి ధర్మారావుతో డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన సువర్ణ

అరసవల్లి: వరుసగా రెండో ఏడాది కూడా పరపటి సువర్ణ గ్రూప్–1 పోస్టు కొట్టేశారు. 2022 గ్రూప్–1 పరీక్షల్లో సత్తా చాటి జిల్లా కేంద్రంలో జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయ పరిపాలనాధికారి (ఏఓ)గా బాధ్యత స్వీకరించి, శిక్షణలో ఉండగానే మళ్లీ తాజాగా ప్రకటించిన గ్రూప్–1 పరీక్షల్లో ఏకంగా డిప్యూటీ కలెక్టర్ పోస్టుకు ఎంపికై రికార్డు సృష్టించారు. సంతబొమ్మాళి మండలం ఆకాశలక్కవరం గ్రామానికి చెందిన పరపటి ధర్మారావు కుమార్తె సువర్ణ ఉస్మానియా యూనివర్సిటీలో జాగ్రఫీలో పీజీ పూర్తి చేశారు. అనంతరం సివిల్స్‌కు ప్రిపేర్ అవుతుండగా, 2022లో తొలి ప్రయత్నంలోనే గ్రూప్–1కు అర్హత సాధించారు. అనంతరం మళ్లీ తాజాగా డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు.

**కలెక్టర్‌గా చూడాలన్నది నాన్న కల**

నన్ను కలెక్టర్‌గా చూడాలన్న నాన్న కల నెరవేరుస్తాను. ప్రస్తుతానికి రెండు సార్లు వరుసగా గ్రూప్–1 పోస్టులు సాధించాను. తాజాగా డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికవ్వడం ఎంతో సంతోషంగా ఉంది. సివిల్స్ ర్యాంకు సాధించడమే లక్ష్యంగా చదువుతాను.

– సువర్ణ, గ్రూప్–1 విజేత

### అసిస్టెంట్ కమిషనర్‌గా మాకివలస వైద్యాధికారి



మార్పు దుష్యంత్ కుమార్

నరసన్నపేట: ఏపీపీఎస్సీ గ్రూప్–1 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన మాకివలస వైద్యాధికారి దుష్యంత్‌కుమార్ స్టేట్ టాక్స్ సర్వీస్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా ఎంపికయ్యారు. గతంలో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ మెయిన్స్ క్వాలిఫై అయ్యి ఇంటర్వ్యూ వరకు వెళ్లానని తెలిపారు. ఆయన తండ్రి మార్పు ఆదినారాయణ విశ్రాంత హెచ్‌ఎం కాగా తల్లి విజయలక్ష్మి న్యాయవాదిగా పనిచేస్తున్నారు.

# వీడిన మర్డర్ మిస్టరీ

- శ్రీకాకుళంలోని వైద్యుని ఇంటిలో హత్య కేసులో పురోగతి
- వివాహేతర సంబంధానికి అడ్డు వస్తోందనే యువతి హత్య
- నిందితురాలిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళంలోని ఓ వైద్యుని ఇంటిలో జరిగిన హత్య కేసును పోలీసులు ఓ కొలిక్కి తెచ్చారు. తన వివాహేతర సంబంధాలకు అడ్డు వస్తోందని, ఎలాగైనా ఆమెను అడ్డు తొలగించుకోవాలని ఆ ఇంటి పనిమనిషి కొట్టు చిట్టెమ్మ ఈ నెల 14న అర్ధరాత్రి తోటి పనిమనిషి తాళ్లవలస రాజును హత్య చేసినట్లు పోలీసు విచారణలో తేలింది. దీనికి సంబంధించిన విషయాలను టౌన్ సీఐ సన్యాసినాయుడు శుక్రవారం విలేకరులకు వివరాలు వివరించారు. ఆ మేరకు..

విశ్రాంత వైద్యుడు గొల్ల జగన్నాథం గత నాలుగేళ్లుగా విశాఖపట్నంలోనే కుటుంబంతో నివాసం ఉంటున్నారు. శ్రీకాకుళంలోని పెదపాడు వీరన్నషెడ్ వద్ద ఉన్న ఇల్లు ఖాళీగా ఉంచకూడదని ఎంతో నమ్మకంగా తన వద్ద ఉన్న పనిమనుషులు చిట్టెమ్మ, రాజులను అక్కడే ఉంచి ఇంటి బాగోగులు వారికే అప్పగించారు. వీరిలో చిట్టెమ్మ ప్రవర్తన చాలా అసభ్యకరంగా ఉండేదని, దీంతో రాజు ఆమెను పలుమార్లు మందలించేదని పోలీసులు తెలిపారు. గడిచిన ఆదివారం ఇలిసిపురంలో గల తన బంధువుల ఇంటికి వెళ్లిన రాజు సోమవారం సాయంత్రానికి ఆ ఇంటికి వచ్చింది. అదేరోజు రాత్రి భోజనాలు అనంతరం మరోసారి చిట్టెమ్మతో వివాహేతర సంబంధాలపై ఇద్దరూ గొడవ పడ్డారు. ప్రతి విషయానికి నన్ను బెదిరిస్తావా అంటూ కోపోద్రిక్తమైన చిట్టెమ్మ అక్కడే ఉన్న చెక్క పేడుతో రాజు తలపై బలంగా మోదింది. దీంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. చిట్టెమ్మ తన బట్టలకు అంటిన రక్తం, చెక్కపేడును ఎవ్వరికీ కనిపించకుండా వేరే ప్రదేశంలో పడేసి అదే రోజు పరారైనట్లు సీఐ తెలిపారు. క్లూస్‌టీం పరిశీలన అనంతరం చిట్టెమ్మను నగర శివారు ప్రాంతంలో రూరల్ పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం ఆమెను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

## ఒడిశా మద్యం పట్టివేత

టెక్కలి రూరల్: ఒడిశా రాష్ట్రం పర్లాఖిమిడి నుంచి అక్రమంగా తీసుకువస్తున్న 35 టిన్ బీర్లను టెక్కలి పోలీసులు అదుపులో తీసుకున్నారు. ఈ మేరకు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. శుక్రవారం స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా నందిగాంకి చెందిన టి.దిలీప్, సీహెచ్ శ్రీకాంత్ అనే ఇద్దరు వ్యక్తులు ఒడిశా నుంచి మద్యం తీసుకువస్తూ పట్టుబడ్డారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ‘జీవో నంబర్ 117ను రద్దు చేయాలి’

శ్రీకాకుళం న్యూకాలనీ: జీఓ నంబర్ 117 ఆధారంగా చేస్తున్న వర్క్ అడ్జస్ట్‌మెంట్‌కు వ్యతిరేకంగా శుక్రవారం సాయంత్రం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ముందు ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. బదిలీలు, ప్రమోషన్లు రీఅపోర్షన్‌మెంట్ జరిగి మూడు నెలలు సమీపిస్తున్నా అధికారుల ఉదాశీనత కారణంగా జీతాలు లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాప్టో అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో పలు ఫ్యాప్టో భాగస్వామ్య సంఘాల నేతలు మాట్లాడుతూ వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను వెంటనే రద్దు చేయాలని, జీఓ 117ను రద్దు చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, బదిలీలు రీఅపోర్షన్‌కు గురైన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని నినాదాలు చేశారు.

జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద పీఆర్‌టీయూ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తంగి మురళీమోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన వర్క్ అడ్జస్ట్‌మెంట్ జీఓను తక్షణమే ఉపసంహరించుకుని, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని నినదించారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు మూడు నెలలగా జీతాలు చెల్లింపులు కావడం లేదని తక్షణమే జీతాలు మంజూరయ్యేలా చూడాలని కోరారు. అనంతరం డీఈఓ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు.

# ఆ ఆలయాలు అర్చకులకే..!

- జిల్లాలో రూ.5 లక్షల లోపు వార్షికాదాయ ఆలయాల గుర్తింపు
- పాలనా వ్యవహారాలను అర్చకులకు అప్పగిస్తూ ప్రభుత్వ నిర్ణయం
- జిల్లాలో మొత్తం 63 ఆలయాల్లో ఈ విధానం అమలుకు నిర్ణయం
- భూముల వ్యవహారమంతా దేవదాయ శాఖదే

అరసవల్లి: రాష్ట్ర ప్రభుత్వం దేవదాయ శాఖలో పలు సంస్కరణలకు తెర తీసింది. ఇప్పటికే ఆలయ భూములకు పక్కాగా లెక్కలుండేలా.. అలాగే అన్యాక్రాంత, ఆక్రమణలపై ఉక్కుపాదం మోపేలా చట్టాన్ని సవరణ చేసి ఆర్డినెన్స్‌ను జారీ చేసిన జగన్ సర్కారు.. వంశపారంపర్య హక్కులను ఇవ్వడం, అర్చకుల జీతాలను పెంచడం కూడా చేసింది. తాజాగా రూ.5 లక్షల లోపు వార్షికాదాయం ఉన్న ఆలయాల పాలనావ్యవహారాలు, బాధ్యతలను ఐదేళ్ల పాటు ఆయా అర్చకుల చేతిలో పెట్టాలని నిర్ణయించారు. ఐదేళ్ల తర్వాత పరిస్థితులను బట్టి కొనసాగింపుపై నిర్ణయించేలా ఆదేశాలున్నాయి. ఇదే అంశంపై దశాబ్దాల కాలంగా అర్చక సమాఖ్య దీనిపై డిమాండ్ చేయగా.. ఎట్టకేలకు జగన్ సర్కార్ అర్చకులకు అనుకూల నిర్ణయాలను ప్రకటించింది. ఈ నిర్ణయంతో జిల్లాలో సుమారు 63 ఆలయాలు అర్చకుల చేతిలోకి రానున్నాయి. ఈ మేరకు ఇటీవల కేబినెట్‌లో ఆమోదం పొందిన తరుణంలో దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ నుంచి మార్గదర్శకాలు వెలువడ్డాయి.

**మొత్తం 63 ఆలయాలు అర్చకులకే..**

జిల్లాలో వార్షికాదాయం రూ.5 లక్షలలోపు ఉన్న ఆలయాలను జిల్లా దేవదాయ శాఖాధికారులు గుర్తించారు. అలాగే ఆయా ఆలయాల పూర్వ పరిస్థితులు, ఆదాయ వనరులు, ధర్మకర్తల వ్యవహారాలు ఇతరత్రా వివరాలను సేకరించారు. వీటిని బట్టి ఆలయ ఆదాయాలను, ఆస్తులను గుర్తించి అర్చకులకు అప్పగించాల్సిన ఆలయాలను మొత్తం 63గా గుర్తించారు. నిబంధనల ప్రకారం వార్షికంగా రూ.25 లక్షల నుంచి రూ.కోటికి పైగా ఆదాయం వచ్చే ఆలయాలను 6ఏ కేటగిరిగానూ, రూ.2 లక్షల నుంచి రూ.25 లక్షలలోపు ఆదాయమున్న ఆలయాలు 6బి గానూ, ఏడాదికి రూ.2 లక్షలోపు ఆదాయాలొచ్చే ఆలయాలను 6సి గానూ, మిగిలిన మఠాలు, ఆశ్రమాలను 6డి కేటగిరీగా గుర్తిస్తారు. తాజాగా గుర్తించిన 63 ఆలయాల్లో 6బి–2, 6సి–57, 6డి–4 చొప్పున ఆలయాల్లో వార్షికాదాయం రూ.5 లక్షల్లోపు ఉన్నట్లుగా గుర్తించారు.


**ఆ బాధ్యతలు మాత్రం..**

రూ.5 లక్షల్లోపు ఆదాయం వచ్చే ఆలయాలు అర్చకులకు అప్పగించనున్నప్పటికీ.. ఆయా ఆలయాల భూముల వ్యవహారాలన్నీ దేవదాయ శాఖాధికారులే పర్యవేక్షించనున్నారు. అలాగే తాజాగా నిర్ణయం మేరకు మార్గదర్శకాల ప్రాప్తికి దేవదాయ శాఖ చట్టం సెక్షన్ 15 ప్రకారం అర్చకులకు అప్పగించిన ఆలయాల్లో ఎలాంటి ట్రస్ట్ బోర్డు (పాలకమండలి) నియామకం జరపరు. సెక్షన్ 29 ప్రకారం ఆ ఆలయాలకు కార్యనిర్వహణాధికారి పోస్టులో ఎవ్వరినీ నియమించరు. సెక్షన్ 57 ప్రకారం ఆలయ నిర్వహణకు ఎలాంటి బడ్జెట్ కేటాయింపులు జరగవు. సెక్షన్ 65 ప్రకారం అసెస్‌బుల్ ఇన్‌కం (దర్శన టిక్కెట్లు, హుండీ ఆదాయం, అద్దెలు, విరాళాలు) ను తీసుకోకుండా ఉండేలా మార్గదర్శకాలున్నాయి. దీంతో ఐదేళ్ల పాటు అర్చకులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాలన నిర్వహణ కొనసాగిస్తే.. తదనుగుణంగా బాధ్యతాకాలం పెంచేలా ప్రభుత్వం నిర్ణయాలను ప్రకటించనుంది.



అర్చకుల చేతిలోకి వెళ్లనున్న ఆలయం

**మార్గదర్శకాల ప్రకారం అప్పగిస్తాం..**



తాజా మార్గదర్శకాల ప్రకారం రూ.5 లక్షల్లోపు ఆదాయం ఉన్న 63 ఆలయాలను గుర్తించాం. ఉన్నతాధికారుల మార్గదర్శకాల ప్రకారం త్వరలో వాటి బాధ్యతలను అప్పగిస్తాం. ఆలయాల భూముల వ్యవహారాలన్నీ మా శాఖాధికారులే పర్యవేక్షిస్తుంటారు. చట్టం ప్రకారం నాలుగు అంశాల్లోనే అర్చకులకు మినహాయింపు ఇచ్చారు.

– ఎస్.చంద్రశేఖర్, జిల్లా దేవదాయ శాఖాధికారి

# సాంకేతికత అందిపుచ్చుకోండి: జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో వరి పంట ఎక్కువగా దిగుబడి ఉన్నందున, అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్ ఆదేశించారు. రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా చూడాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ పంట ప్రారంభమైందని, దీనిపై పూర్తిస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. సలహా మండలి గత సమావేశంలో చర్చించిన అంశాలపై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, తీసుకున్న చర్యలను ఈ సమావేశంలో తెలియజేయాలని చెప్పారు. ఖరీఫ్ పంటలకు అవసరమైన నీటిని నీటిపారుదల శాఖ అధికారులు విడుదల చేయాలని చెప్పారు. అలాగే విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు రైతులకు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ మాట్లాడుతూ జిల్లాలో వరి పంట దిగుబడి ఎక్కువగా ఉందని చెప్పారు. ఈసారి తక్కువ నీటితో వరి పంటను పండించేలా పైలెట్ ప్రాజెక్టుగా ఏడబ్ల్యూడీని తీసుకురావడం జరిగిందన్నారు. దీన్ని వినియోగించుకునే రైతులకు సంస్థ ద్వారా పారితోషికం కూడా అందజేస్తామన్నారు.

జిల్లా వ్యవసాయ అధికారి కె.శ్రీధర్ మాట్లాడుతూ జిల్లాలో ఒక లక్ష 62 వేల హెక్టార్లలో వరి పంటను వేశారని, తద్వారా 9 లక్షల 60వేల మెట్రిక్ టన్నుల ధాన్యం పండే అవకాశం ఉందని అంచనా వేసినట్లు తెలిపారు. అందుకు తగిన నీటిని విడుదల చేయాలని సంబంధిత అధికారులను కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఎల్‌డీఎం ఎం.సూర్య కిరణ్, జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఆర్‌వీ ప్రసాదరావు, మత్స్య, పశుసంవర్ధక శాఖల సంయుక్త సంచాలకులు డాక్టర్ పీవీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.కిషోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాకు చంద్రబాబు ఏం చేశారు..?

- కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి సూటి ప్రశ్న



టెక్కలిలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి

టెక్కలి: ఎన్టీ రామారావుకు వెన్ను పోటు పొడిచి అడ్డదారిలో ముఖ్యమంత్రి పదవిని కాజేసిన చంద్రబాబు, తన 14 ఏళ్ల పాలనలో జిల్లాకు ఏం చేశారని కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి సూటిగా ప్రశ్నించారు. విజన్ 2047 అంటూ మోసకారి మాటలు చెబుతున్నారని ఆమె దుయ్యబట్టారు. ఆమె శుక్రవారం టెక్కలిలో మీడియాతో మాట్లాడారు. విజన్ 2047 అంటూ ఇటీవల ప్రతిపక్ష నేత చంద్రబాబు కొన్ని అంశాలను తెరపైకి తీసుకువచ్చారని, అయితే అవి సాధించడానికి 14 ఏళ్ల కాలం సరిపోలేదా అని ఆమె ప్రశ్నించారు. 14 ఏళ్లలో చంద్రబాబు సాధించలేని అభివృద్ధిని కేవలం నాలుగేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాధించారని కృపారాణి తెలిపారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనానికి ప్రధాన కారకుడైన చంద్రబాబుకు ఏం అర్హత ఉందని జిల్లాలో పర్యటించారని ఆమె నిలదీశారు. చంద్రబాబు పాలనలో జిల్లాకు ఒక్క ప్రాజెక్టును తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి తర్వాత ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే జిల్లాలో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి ప్రాజెక్టులకు రూపకల్పన జరిగాయని కృపారాణి పేర్కొన్నారు. ఎన్నో తరాల నుంచి ఉన్న ఉద్దానం కిడ్నీ సమస్యను పరిష్కరించడానికి ఒక వైపు కిడ్నీ రీసెర్చ్ సెంటర్, మరో వైపు ఆ ప్రాంతానికి మంచినీటి ప్రాజెక్టులు అందజేశారని తెలిపారు. ఎవరి పాలనలో జిల్లా అభివృద్ధి చెందిందో చెప్పడానికి డాక్యుమెంటరీతో సిద్ధంగా ఉన్నామని, దీనిపై టీడీపీ నాయకులు చర్చకు రాగలరా అని సవాల్ విసిరారు. ‘మీ ఇంటికి వస్తే ఏమిస్తావ్...మా ఇంటికి వస్తే ఏం తెస్తావ్’ అనే సామెత మాదిరిగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జగన్ పథకాలతో రాష్ట్రం శ్రీలంకగా మారిపోతుందని గగ్గోలు పెట్టిన చంద్రబాబు, ఈ రోజు టీడీపీ మేనిఫెస్టోలో పెట్టిన హామీల సంగతేమిటని ప్రశ్నించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సొంత పంచాయతీలోనే సంక్షేమ పథకాల రూపంలో సుమారు 26 కోట్ల రూపాయలు అందజేశామని ఆమె గుర్తు చేశారు.

రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో సారి ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని కృపారాణి వెల్లడించారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ సత్తారు సత్యం, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ కె.రామ్మోహన్‌రావు, వాకాడ శ్రీధర్‌రెడ్డి, బి.కార్తీక్, సిహెచ్.జీవన్, పి.రమేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# ‘పంట నమోదు వేగవంతం చేయాలి’



వ్యవసాయ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్

రణస్థలం: రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామ సచివాలయ వ్యవసాయ అసిస్టెంట్లు పొలం పరిశీలించి పంట నమోదు వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయాన్ని సందర్శించి, గ్రామ సచివాలయ అసిస్టెంట్లు, అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రాప్ రైతు కేంద్రాలు, ప్రైవేటు రైతులకు ఎరువులు, విత్తనాలు విక్రయాలు జరిపినప్పుడు తప్పనిసరిగా ఆధార్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. అలాగే 20 సెంట్లు దాటిన ప్రతి రైతు పొలంలోని పంట పరిశీలించి క్షేత్రస్థాయిలోనే నమోదు చేయాల్సి ఉందని చెప్పారు. ఈ క్రాప్‌లో నమోదు చేయకపోతే బీమా, పంట విక్రయాలు జరపడం సాధ్యం కాదని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏలు వి. శ్రీనివాసరావు, వెంకటరావు, రణస్థలం, జి.సిగడాం ఏవో శారద, ఉద్యానవన ఏవో అనూష, గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

# ఒడిశాకు ఏపీఎస్ ఆర్టీసీ సేవలు

- నేటి నుంచి రాకపోకలు సాగించనున్న 7 బస్సులు

కొరాపుట్: ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ(ఏపీఎస్ ఆర్టీసీ) కొత్తగా 7 బస్సులను ఒడిశా వైపు నడపనుంది. ఇవి శనివారం నుంచి రోడ్డెక్కనున్నాయి. విశాఖపట్నం నుంచి బయల్దేరి అవిభక్త కొరాపుట్ జిల్లాల్లో ప్రయాణించనున్నాయి. విశాఖపట్నం నుంచి సాయంత్రం 5 గంటలకు బయల్దేరి సాలూరు మీదుగా నబరంగ్‌పూర్‌కు ఒక బస్సు నడవనుంది. అదే బస్సు ఉదయం 5 గంటలకు నబరంగ్‌పూర్ నుంచి బయల్దేరి విశాఖపట్నం వెళ్లనుంది. మరో బస్సు ఉదయం 10 గంటలకు బయల్దేరి సాలురు మీదుగా జయపూర్ రానున్నది. అదే బస్సు రాత్రి 8 గంటలకు విశాఖపట్నం వెళ్లనుంది. ఒక బస్సు విశాఖపట్నం నుంచి సాయంత్రం 3.30 గంటలకు బయల్దేరి ఎస్.కోట, అరుకు మీదుగా ఒనక ఢిల్లి వెళ్లనుంది. అదే బస్సు ఉదయం 5 గంటలకు ఒనక ఢిల్లి నుంచి బయల్దేరి విశాఖపట్నం వెళ్లనుంది. విశాఖపట్నం నుంచి ఒక బస్సు ఉదయం 10 గంటలకు బయల్దేరి శ్రీకాకుళం, పాతపట్నం మీదుగా పర్లాకిమిడి వెళ్లనుంది. అదే బస్సు సాయంత్రం 3.15 గంటలకు బయల్దేరి విశాఖపట్నం వెళ్లనుంది. విశాఖపట్నంలోని కూర్మనపాలెం నుంచి ఉదయం 6 గంటలకు బస్సు బయల్దేరి శ్రీకాకుళం, పర్లాకిమిడి మీదుగా గుణుపూర్ వెళ్లనుంది. అదే బస్సు మధ్యాహ్నం 1 గంటలకు గుణుపూర్ నుంచి బయల్దేరి విశాఖపట్నం వెళ్లనుంది. సింహాచలం నుంచి మధ్యాహ్నం 1.30కు బయల్దేరి విశాఖపట్నం రాజాం, పాలకొండ, కొత్తూరు, హడ్డుబంగి మీదుగా ఒక బస్సు గుణుపూర్ వెళ్లనుంది. అదే బస్సు వేకువజామున 4 గంటలకు గుణుపూర్ నుంచి బయల్దేరి తిరిగి సింహాచలం వెళ్లనుంది. విశాఖపట్నం నుంచి సాయంత్రం 4 గంటలకు బయల్దేరి విజయనగరం, పార్వతీపురం, గుమ్మ లక్ష్మీపురం మీదుగా గుణుపూర్ బస్సు వెళ్లనుంది. అదే బస్సు గుణుపూర్‌లో ఉదయం 6.30కి బయల్దేరి విశాఖపట్నం వెళ్లనుంది.